*నా పల్లె ప్రజలు పచ్చాకుకి బంగారు రంగును అద్దే నిపుణులు. పొగాకు చేదులో జీవన తియ్యదనాన్ని కలగనే అమాయకులు. బార్నీ బూడిదల్లో మొలిచిన మల్లెపూలు. నా పల్లె ప్రజలకి బ్రతికించడం తెలుసు. బ్రతకడం నేర్చుకోవాలిక.*

ఇండ్ల చంద్రశేఖర్

# 14 పచ్చాకు సీజన్





అర్ధరాత్రి చీకటి చిక్కంగా అల్లకపోయుంది ఊరిమీద. దానేలు పొగాకు బేర్నీ పొయ్యిలో మొద్దులు వెయ్యడానికి తలుపు తీసేడు. అయిదారు పెద్దపెద్ద చిల్ల మొద్దుల్ని పొయ్యిలోకి ఇసిరేశాడు. ఒక చిన్న కర్రకు తగులుకున్న నిప్పుతో చుట్ట ముట్టించుకొని రాగాలకర్రతో పొగాకు బేర్నీ పొయ్యి తలుపు మూసేసేడు. నులకమంచం మీద ఎల్లికల గా పడుకొని చుట్టకు చుక్కలు చూపిస్తూ నిద్ర రాకుండా ఉండేందుకు పద్యాలెత్తు కున్నాడు.

"నాయాల కాలన్న కొట్టుకాడ నిదెట్టబట్టిన్దిరా," అన్న రూబేను అరుపుకి ఉలిక్కిపడి లేచాడు దానేలు.

గబుక్కున బేర్నీ పొయ్యి సాయ చూసి, "ఒర్నియ్యక్క ఇప్పుడేరా కళ్లు మూసింద్యా... అప్పుడే రెండున్నరయ్యిందా," అన్నాడు రూబెన్ని చూస్తూ.

"ఇంటికి బోయి పొడుకో పో. కొట్టుకాడ జాగర్తగా కనిపెట్టుకొని వుండద్దా... అటీటయైతే ఎంత నష్టమనుకున్న," అన్నాడు రూబేను.

"మాకు తెలుసులేసేయ్," అంటా డ్యూటీ దిగి ఇంటి బాట పట్టాడు దానేలు. డ్యూటీ ఎక్కేడు రూబేను.

దానేలు ఇంటికి చేరుకోనేలికే మూడయ్యింది. లైటేశాడు. ఒక మంచంపై తన పెళ్లాం పడుకొని వుంది. ఇంకో మంచంపై ఉండాల్సిన కొడుకు లేడు. 'రేపొద్దున్నే ఈడి ఫోన్ పగలనూకాలి, అప్పుడుగాని దారికి రాడు,' అనుకుంటా మిద్దె మీదకి వెళ్లాడు.

కొడుకు దుప్పటి బిర్రుగా కప్పుకొని నిద్రపోతున్నాడు. ఆశ్చర్య పోయినట్టు చూసి కిందకి రమ్మందామని దుప్పటి లాగాడు. దానేలుకి గుండె నీరుకాయపడింది దుప్పటి కింద కొడుకుని, వాడిని వాటేసుకొని పొడుకొని వున్న ఒక అమ్మాయిని చూసేసరికి. ఒళ్లు తెలియకుండా నిద్ర పోతున్నారిద్దరూ. దానేలుకి ఏమి సెయ్యాలో అర్థంకాల. ఆ పిల్లెవురో అర్థంకాల. కిందకి పరిగెత్తేడు.

"ఒసేయ్ న్నీయమ్మ నిద్రపోయింది సాల్లేయే... ఆ నా కొడుకు ఎమ్జేసేడో సూడు," అంటా పెళ్లాన్ని రెక్క పొట్టుకొని పైకి లేపాడు.

ఆంతున కూలబడిందిగానీ నోట మాటరాల ఆమెకి, కొడుకుని అలా చూసే సరికి.

"మేయ్ సూసింది సాల్లే గాని వోడ్ని లేపు మే," అన్నాడు కోపం కలగలిసిన బాధతో.

"ఒరేయ్ ఎవురా ఆ పిల్ల," అని అర్సింది.

ఉలిక్కిపడి లేసేడు. ఆ పిల్ల కూడా లేసి ఎవురన్నట్టు వాడి వైపు చూసింది.

"మాయమ్మ... నాన్న," అన్నాడు వాడు.

"నమస్కారం అత్తమ్మ... నమస్కారం మావయ్యా," అనేసింది ఇక ఏమి అనాలో తెలియక.

అంత సలిలో కూడా సెమట్లు పోసినియ్ దానేలుకి.

"మేయ్ దొడ్లోకి పోయోత్తాగాని ఆ పిల్లెవురో కనుక్కో ఈ సోదోడ్ని," అంటా కిందకి పరిగెత్తేడు. కిందకి పోతున్నప్పుడే లుంగిలో వుచ్చపడ్డాయ్ దానేలుకి.

"అయ్యో ఎవుర్రా ఆ పిల్లా," అంది గుండె దడలో వచ్చే వణుకుతో.

"మౌ నేను ప్రేమించే... ఈ పిల్లనే పెళ్లి చేసుకుందామనుకుంటున్నానే... ఇక నుంచి ఈ ఆమ్మాయి మనింట్లోనే వుండిద్ది. హాస్టలునుంచి ఇటే వచ్చిందంటే నా కోసం," అన్నాడు నవ్వు మొకంతో పిల్లోడు.

"అస్లీ పిల్లేడ పరిచయం అయ్యిన్రా నీకు," అని అడిగేడు మిద్దెమీదకొస్తూ దానేలు.

"పేస్బూక్లో" అన్నాడు.

"ఆ వూరు నువ్వేం నాకనుపోయావురా కొట్టినాబట్ట" అడిగింది దానేలు పెళ్లాం కోపంగా.

"అసలేవురమ్మాయ్ మీదే... ఈడకెట్టా వొచ్చేవు?" అన్నాడు దానేలు గద్దిచ్చి నట్టు.

"మా సొంతూరు గుంటూరు, విజయవాడ హాస్టల్లో వుండి చదువుకుంటున్న మామయ్యా."

"ఏమిట్లమ్మా మీరు," అంది దానేలు పెళ్లాం.

ఆ పిల్ల చెప్పింది వినేలికే దానేలికి లుస్గీ తడిసిపోయింది. గబాగబా కిందకి పరిగెత్తేడు.

"ఎంద్రసే మొగడో ఇన్నిసార్లు బోతన్న. ఇరేసనాలు అవుతున్నాయా ఎంది?" అనడిగింది దానేలు పెళ్లాం.

ఇస్రాయెలు ఆక్కొట్టను పోను జనాల్ని నిద్ర లేపడానికి వేస్తున్న కేకలు స్పష్టంగా వినపడుతున్నాయి అ మిద్దెమీదొల్లకి. కిందకు పోయిన దానేలు గసపెట్టుకుంటా పైకొచ్చి-

''మేయ్ జనాలు పనులకి పోయే టైం అయ్యింది. వాళ్లు వీళ్లని చూసేరంటే నానా రకాలుగా అనుకుంటారు గానే మీ ముగ్గురు పొస్టు బొస్సుకే ఒంగోలు పొండి, నేను ఎనకాల వస్తా... లెగండి లెగండి,'' అన్నాడు.

❖

పన్నెండు గంటలకే బయట బాగా ఎండ కాస్తుంది. ఆక్కొట్టను బోయినో ల్లందరూ ఇల్లకొస్తున్నారు.

''వోవ్ ఎవురో ఆడకూతురు మార్కొల్ల బాయికాడ ఉలుకు పలుకు లేకుండా పడుంది. ... మీ వూరు పిల్లేమో సూస్కోండి పొండి,'' అని గత్తర గత్తరగా చెప్పేరు వాళ్లతో, మోటార్ సైకిల్ మీద ఊళ్లోకి పోతున్న ఇద్దరు మనుసులు.

ఆ గత్తర చూసి ఆ రోడ్డులోంచి ఈ రోడ్డులోంచి బండులున్నోల్లు బండుల మీద, లేనోళ్లు సైకిల్ల మీద, ఆడోల్లు నడుచుకుంటా మార్కొల్ల బాయి దగ్గరకు వచ్చేరు. ఆ బాయి పక్కన పెద్ద ఎండాకు మూట పక్కన ఉలుకూ పలుకూ లేకుండా పడి వుంది సువార్త.

అక్కడికి చేరుకున్న ఇద్దరూ ఎండలో పడివున్న సువార్తని ఏప చెట్టు కిందకి పట్టేరు.

''ఒరేయ్ ఈ నీళ్లు తాపియ్యండి,'' అంటా అప్పుడే అక్కడికి వచ్చిన ఒకామె నీళ్లిచ్చింది.

''ఒసేయ్ ఇది సువార్తంటే... దీనికిది కొత్తేం కాదులే... ఒరేయ్ మొకం మీద నీళ్లు చల్లండి అదే లేసి కూర్చునిద్ది,'' అంది సువార్తమ్మకు అత్త వరసయ్యే రాయేలు.

మొకం మీద నీళ్లు చల్లేరు కుర్రాళ్లు.

''ఏలా పాలా లేకుండా ఎండాకు (పచ్చ పొగాకు కోసిన తర్వాత, మొక్కలు చిగురు వేసి ఆనక ఎండిపోయిన ఆకులు) ఏరుకోవడానికి పోయేది, కళ్లు తిరిగి పడిపోయేది. మరీ గొడెందెగుందిరా (ఆత్రం) స్వామా ఎండాకు ఏరుకునే కాడా, ఎవురన్న సల్లపూట పోయి ఎండాకు ఏరుకొని వత్తారు. ఇది నాలుగైదు సార్లు పొలాల మీద పడి తిరిగిద్ది దీని మొగుడి సొమ్మంత రొళ్లుకోడానికి,'' అనింది రాయేలు అక్క డున్నోల్లతో.

''నిజమేనేస తల్లా దాని ఇంటి ముందు బండెడు ఎండాకు ఆరేసినా గాని దీని కుతి తీర్లా,'' అనింది ఇంకొకామె.

కళ్లు తెరిసింది సువార్త. సేతుల్ని నడుంకి సపోర్ట్‌గా బెట్టుకొని నిలబడలేక నిలబడింది.

"ఎందుకసే తల్లో నీకంత ఆత్రం యాడికిపోద్దిమే ఎండాకో. ఏదొక సల్లబూట రావాలిగానే. అదే పనిగ తిరుగుతుంటివే రేపు నీకేమన్నా అయితే నీ కూతురికి దిక్కెవురసే మగడో," అనింది రాయేలు.

ఏం మాట్లాడల సువార్త. ఎండాకు మూట కాడికి కదిలింది.

"దీనెమ్మ నాయాల్ది కళ్లు దిరిగి పడిపోయినా కూడా ఎండాకు మీద ఆశ సావలేదురా," అన్నాడు గుంపులోంచి ఒకాయన.

అందరు నవ్వారు.

"మోయ్ సువార్తో రా బండెక్కు మీ ఇంటి కాడ దిమ్పుతా," అన్నాడో కుర్ర పిల్లోడు బండి స్టార్ట్ చేస్తా.

"అక్కో నువుబోయి ఆ బండెక్కు నేను ఈ మూట తీసుకొస్తా," అన్నాడు ఆ మూటని లేపి వాడి సైకిల్ మీద పెట్టుకుంటా.

సువార్త బండెక్కి ఇంటికి పోయింది. జనాలు ఎవురిల్లకి వాళ్లు కదిలేరు.

ఏరకొచ్చిన ఎండాకు మూట యిప్పి ఆరబోసి తొట్టికాడికి పోయి కాల్లు చేతులు కడుక్కుంటా వుంది ఇంటికొచ్చిన సువార్త.

"మౌ ఎప్పుడొచ్చేవే" అంటా ఆ పక్క ఇంట్లో నుంచి బయటకు వస్తా అడిగింది పన్నెండేళ్ల సువార్త కూతురు రెబకా.

"ఒసే కొజ్జదానో నిన్ను ఇల్లు వదిలిపెట్టి యాడికి పోవద్దనిండ్ల... నువ్వు ఎవురింటికి పోకూడదని సెప్తే అర్థంకాదా?" అని సేతిలో వున్న జైలంసిరి సెంబు ఆ పిల్ల మీదకి ఇసిరేసింది.

"ఇప్పుడే మా పోయిందే ఇప్పుడిదాక ఇంట్లోనే వుంటినే."

"నీకు సెప్తే అర్థం కాదంటమే... నువ్వు అట్ట పోకూడదమ్మే," అనింది ఇంట్లోకి లాక్కొచ్చి.

"నాకు తెలుసులేయే నేను ఎవ్వురికి సెప్పలేదులే పెద్దమనిశినయ్యానని."

"మీ నాన్నేమో తాగి తాగి సచ్చా. మాయమ్మా మా నాన్న సూడబోతే కూటికి గతిలేనోల్లెనయ్యి, అత్త సూడబోతే నన్ను ఏరేకాపారం పెట్టుకోమనే, ఇప్పుడు నా దగ్గర సిల్లి గవ్వ లేకపోయే ఇప్పుడు నువ్వు పుస్పావతి అయ్యావని నలుగురికి తెలిత్తే నీకు ఫంక్షను చేసి పల్లెకంతా కూడు బెట్టాలయ్యే... అన్దుకదంటమే నిన్ను ఇల్లు కదల ద్దంది," అంది ఏడుస్తా సువార్త.

"యమోవ్ నువ్వేడవ బాకే," అంది బాధగా రెబక దగ్గెరకొచ్చి.

"ఒమేయ్ నేను ఏరకొచ్చిన ఎండాకు అమ్మితే ఎంత లేదన్నా పదిహేనేలు వత్తాయిమే, ఆకు కొనేవొల్లు రాబోయేలికె ఇంకొక అయిదేలకి ఆకేరితే సాలు, అప్పుడందరికి నువ్వు పుస్పావతయ్యావని చెప్పి ఫంక్చను చేద్దాం. అప్పుడు దాక నువ్వు ఎవురితో అనబాక తల్లా," అనింది సువార్త.

"మౌ నాకు తెలుసులేయే నువ్వు మల్లి మల్లి సెప్పబాకే," అంది రెబక.

"నువ్వు పచ్చాకు సీజన్లో పెద్దమనిశి వయ్యావు కాబట్టి సరిపోయిందిగాని అదే పనుల్లేని టైంలో అయ్యుంటే నా పరిస్థితి ఏమయ్యేదో? తలుసుకుంటేనే బయంగుంది మే," అనింది కూటికుండ మీద మూత తీస్త.

❖

ఇంటిముందు ఏదో అలికిడి అయినట్టు వుంటే వెనక్కి తిరిగేడు చిన్న ముసలయ్య. కూతురు అల్లుడు నుంచొని వున్నారు గుమ్మం ముందు.

"అమ్మేదే," అనడగింది కర్రల సంచి కిందబెడతా కూతురు.

"ఇప్పుడే అటుపోయిన్దంమాయ్.. ఆ మంచమేసుకొని కూర్చోండి, ఇప్పుడేనా రావటం, బాగున్నారా?" అన్నాడు ఇంట్లోకి బోయి చెంబుతో మంచినీళ్లు తెస్తా.

"మేము బాగానే వున్నాం లేయే."

"నీ కూతురు కాపురం ఎట్టా వుందంటా" అడిగాడు చిన్న ముసలయ్య.

"వాళ్లకేమి బాగానే వున్నార్లె," అంది మొగుడికి మంచినీళ్లు అందిస్తా.

"ఎప్పుడొచ్చారంమాయ్" అంటా ఇంట్లోకి వచ్చింది చిన్న ముసలయ్య పెళ్లాం.

"ఇప్పుడేలేయే యాడికి పోయోత్తన్నా..."

"బొంకాడికమ్మాయ్... కూసొండి అన్నం వండుతా తిన్దురుగాని."

"అప్పుడే కూటికి తొందరేమున్దిలే," అన్నాడు అల్లుడు.

"బుజ్జిగోడు ఎక్కడకి పోయాడు మా," అని అడిగింది కూతురు.

"స్టడీకి పోయాడంమాయ్, ఈ సంవత్సరం వాడు పదో క్లాసు కదా," అంది కొడుకునుద్దేశ్యించి.

"వౌ చిన్నముసలమాం ఆనిక్క తొమ్మిది గంటలకి చర్చీ కాడ మీటింగు ఉందంట ఆడికి రా," కేకేసాడు రోడ్లో నుంచొని మనుషుల్ని మీటింగులకి పిలిచే ఏదాసు.

"మీటింగా! మీటింగు దేనిగురించి రా," అనడిగాడు ముసలయ్య ఇంట్లో నుంచే.

"అదేనే ఆ నవాకు కొడుకు గురించి," అన్నాడు ఏద్దాసు.

"అసె సరిగ్గా సెప్పసే," కసురుకున్నాడు ముసలయ్య.

''అదేనే... ఆ నవాకు కొడుకు మొన్న బండితో ఇసాకు మామని గుద్దిండ్లా... ఆయనకేమో రెండు కాళ్లిరిగా ఆస్పిటల్లో ఉన్నే. దాని గురించే మీటింగు,'' అని ఇంకో ఇంటికి కదిలాడు ఏదాసు.

''మరీ మిడిమాల్యంగా తోలతున్నారమ్మాయ్ పిల్లలు బండ్లు,'' అంది ముసలయ్య పెళ్లాం.

అల్లుడొచ్చాడని పొప్పు చేసి కోడిగుడ్ల ఏపుడు చేసింది. కూటికాడ కూర్చున్నారు.

''ఆ చెప్పంమాయ్ ఏంది ఎందుకొచ్చారు,'' అని అడిగాడు ముసలయ్య.

''ఏం లేదులేయే ఊరికినే మిమ్మల్ని చూసి పోదామని వచ్చాం.''

ముసలయ్య నమ్మలేదు గాని నవ్వాడు. కొంచెం సేపు ఎవురు మాట్లాడలా.

''పన్లెట్లున్నాయ్ మీ వూళ్లో.''

''పనులేడున్నయిమా అందుకే కదా మీ ఊర్లో పచ్చాకొప్పుకున్నం.''

''మా ఊర్లోనా? ఎవురి ముఠాలో? '' అని మల్లి అడిగింది ముసలయ్య భార్య.

''బాబురావు మామ ముఠాలో,'' సమాధానం చెప్పింది వాళ్ల నాన్న మొఖంలోకి చూస్తా.

ముసలయ్య గమ్మున కూడు తింటున్నాడు.

''నీకు తెలియిన్దేముంది నాన్నా... వడ్డీలకి డబ్బులు తెచ్చి పిల్లకి పెళ్లి చేస్తిమే, కూలికిబోతే వచ్చేదేమో అంతంత మాత్రమెనయ్యా. అందుకే పచ్చాకొప్పుకుంటే జతకి నలబై వేలు ఇస్తామన్నాడు బాబురావు మామ'' అంది కూతురు.

''ఇక్కడేడుంటారమ్మాయ్... మీ ఊర్లో లేవా పచ్చాకు పన్లు,'' అన్నాడు తల దించుకొని అన్నం తింటా ముసలయ్య

''మా ఊర్లో మమ్మల్ని నమ్మి మాకెవురు అడ్మాన్సు ఇస్తారు నాన్న. అందుకే బాబురావు మామ దగ్గర ఇరవైవేలు అడ్మాన్సు తీసుకొని పెళ్లికి చేసిన ఒక అప్పు తీర్చేం. బయటెక్కడో వుంటే ఖర్చులు ఎక్కువవ్వవా అందుకే ఈ రెండు నెలలో మనింట్లోనే వుండి పనుల కెల్దామని అనుకుంటున్నాం,'' అంది కూతురు.

''ఈడేడుంటారమ్మాయ్ ... వుంది ఒక్క రూమేనయా, పిల్లోడు లోపల చదువు కుంటుంటే మేము పంచలో పొడుకుంటంటమే, మళ్లీ మీరంటే ఎట్ట కుదిరిద్దమ్మా, మొదిలికే వాడిప్పుడు పదో క్లాసయ్యే,'' అంది అల్లుడు మొఖంలోకి అనుమానంగా చూస్తా ముసలయ్య భార్య.

అల్లుడు అన్నం తినడం అయిపోయి పళ్లెంలో చెయ్యి కడుక్కుంటున్నాడు.

''అయ్యో కొంచెం అన్నమేసుకోయ్యా,'' అంది ముసలయ్య భార్య.

''కడుపు నిండిన్దిలే'' అన్నాడు పైకి లేచి మంచంమీద కూర్చుంటా.

“కావాలంటే ఒక బియ్యం బస్తా తెస్తాం లేయే,” అనింది కూతురు.

“నీ యమ్మ కూటికోసమంటే” అని ఏదో చెప్పబోయి, “సరేలే రండి ఎట్టో కట్ట ఉందాం...” అన్నాడు చెయ్యి పళ్లెంలో కడుక్కుంటా.

నాన్న తిన్న పల్లేన్ని మొగుడు తిన్న పల్లేన్ని తొట్టికాడికి తీసుకపోయి కడిగింది నవ్వుతా.

“సరే పోయి రెండు రోజుల్లో సామాను తీసుకొని వత్తాం మామ,” అంటా బయటకు నడిచాడు అల్లుడు. నవ్వుకుంటా ఎనకాలే పోయింది కూతురు.

“పెళ్లిచేసి కాపురానికి పంపినాక కూడా కష్టమొత్తే పుట్టిల్ల వైపే సూత్తంట్రీ ఆడపిల్లలు ఏమిచెయ్యాల?” అని మొత్త కానుకొని కూసుంది.

“సర్లే ఈ పచ్చాకు సీజను దాటిపోతే వాళ్ల బతుకు వాళ్లే బతుకుతారు రానియ్ సూద్దాం,” అంటా మీటింగు కాడికి బయలుదేరేడు ముసలయ్య.

❖

చర్చికాడ మీటింగు మొదలయ్యింది.

“ఇదిగో చూడు డబ్బులు బొబ్బులు కట్టమంటే మా దగ్గర లెవ్వని గట్టిగ చెప్పు. మూగిమొద్దాల నున్చోకుండా,” అని చెవిలో గొనుగుతుంది నవాకు పెళ్లాం నవాకుతో.

“ఆ సెప్పండబ్బాయ్ ఇస్సాకు మామకి రెండు కాల్లిరిగి హాస్పిటల్లో ఉన్నే, ఆ కాళ్లు బాగావ్వాలంటే లచ్చ పైనే అయ్యిద్దంటా. వాళ్లూ మీలాగే కూలికి పోయేవోల్లెగా వాళ్లేడ దెస్తారు అన్ని డబ్బులు,” అన్నాడు ఒక ముఠా పెద్ద ఆదాం.

“ఒరేయ్ గొడవలు గిడవలు వద్దబ్బాయ్... నేను చెప్పినట్టు ఇనండి ఇద్దరికీ నష్టం జరక్కుండా చెప్తా... ఇక ఇంతటితో ఆపేద్దాం,” అన్నాడు అందరి ముఠా పెద్ద లతో విడివిడిగా మాట్లాడిన ఒక కుల పెద్ద తిమోతి.

“సరే చెప్పండి నేనేం చెయ్యాలో,” అన్నాడు చిన్నగా నవాకు.

“అబ్బాయ్ నవాకా... లెక్క ప్రకారం హాస్పిటల్ కయ్యే కర్చంతా మీరే పెట్టు కోవాలబ్బాయ్. కాని, మీరు కూడా కూలికి పోయేవోల్లె కాబట్టి ఒక యాభై వేలు సర్దుకొండి,” అన్నాడు తిమోతి.

“యాభైయేలుకి మేమేడికి పోవాల స్వామే... మా దగ్గరెక్కడున్నాయ్ యాభై యేలు.”

పిల్లోడికి బండి కొనిపిచ్చి వూరిమీదకి తోలితివే అప్పుడెరగావా... ఎట్టోకట్టా నూక్కరా. మడిసిని నిలువునా కాల్లిరగ్గొట్టి మూలాన కూసోబెడితిరే,” అన్నాడు ఇస్సాకు తమ్ముడు.

"ఈ సెడునాబట్ట చేసిన పనికి గుట్టుగా కాపురం చేసుకొనే మేము ఇట్టా నలుగురిచేత అనిపించుకోవాల్సి వచ్చింది. యాబై వేలు యాడ తీస్కరావాల?" ఏడు పెత్తుకుంది నవాకు పెళ్లాం.

"ఎవుడికోసమియ్యవ్," ఇస్సాకు తమ్ముడు.

"మేమియ్యం ఏం చేసుకుంటావో చేస్కో."

కలబడ్డారు... జుట్లు జుట్లు పట్టుకున్నారు. ఇక నలుగురు పెద్దలు కలుగ చేసుకొని అందర్నీ తిట్టి కొట్టబోయి గోలను ఆపుచేసేరు

"ఈళ్లు నా పచ్చాకు ముఠావాళ్లే కాబట్టి వాళ్లు ఒప్పుకుంటే నేను కష్టమైనా రాజుగోరి దగ్గర్నుంచి నలబై వేలు ఇప్పిస్తానబ్బాయ్ వాల్ల నొప్పియ్యండి," అన్నాడు పచ్చాకుముఠా కట్టిన ఇశ్రాయేలు.

"ఏమంటావ్రా నవాకా?" అన్నాడు కులపెద్ద.

"ఇక అనేదేముంద్రసే నోరుమూసుకొని ఒప్పుకోవాల్సిందే," పెద్దలందరూ పైకి లేసేరు.

"నాయాల్ది పచ్చాకు సీజను కాబట్టి తప్పిచ్చుకున్నాడ్రా నవాగ్గాడు. లేకపోతే ఈ డబ్బులకోసం నానా సంకలు నాకాల్సి వచ్చేది," అని నవ్వేడు గుంపులోంచి ఒకడు.

అందరు ఎవురిల్లకి వాళ్లు ఎల్లిపోయేరు. నవ్వాకు పెళ్లాం మాత్రం అక్కడే కూర్చొని నోటికొచ్చిన తిట్లన్నీ తిడతా దుమ్మెత్తిపోస్తుంది కుల పెద్దల్ని.

❖

ఆ అమ్మాయిని వాళ్లింటికి పంపడానికి దానేలుకి పెద్ద కష్టం కాలేదు కాని ఆ పిల్ల బంగారపుదండ బ్యాంకులో పెట్టి, దానేలు కొడుకుకి కొనిపించిన ఫోను తాలూకు డబ్బులు ఇంకా చిన్నచితకా ఖర్చులు కలిపి మొత్తం ఇరవైదేలు కట్టి బ్యాంకులో దండ ఇడిపిస్తే ఏ గోలా చెయ్యకుండా ఇంటికి వెళ్తానని అంది. నలుగురిలో నవ్వులపాలు అవ్వడం ఇష్టంలేక అయిదు రూపాయల వడ్డీకి ఇరవై అయిదేలు తీసుకొని బ్యాంకులో పెట్టిన దండ ఇడిపించి ఆ పిల్లను ఇంటికి పంపడమే దానేలుకి చాల కష్టమయ్యింది. మూడు నెలల కష్టం నోట్లోకి పోకుండానే వడ్డీలోడికి పోవడం తలుచుకొని ఏడవని రోజేలేదు దానేలు.

'పచ్చాకు సీజన్ కాబట్టి ఆ వడ్డీలోడు నన్ను నమ్మి ఇంత మొత్తం ఇచ్చేడు? ఆ డబ్బే లేకుంటే నా పరువు ఏమయ్యేదో,' అని తలుచుకొని గడగడ లాడిపోయేడు.

తెల్లారింది.

మూటాముల్లె సర్దుకొని చిన్నముసలయ్య కూతురు, అల్లుడు పచ్చాకు పని లోకి పోవడానికి వస్తున్నప్పుడు, కొడుకు చేసిన నిర్వాకానికి నవాకు, నవాకు పెళ్లాం

మొఖంలో నెత్తురుసుక్క లేకుండా రేక దుయ్యడానికి వెళ్తా వాళ్లకి ఎదురొచ్చేరు. చిన్నముసలయ్య కూతురు పలకరించినా వాళ్లు పలకలా.

సువార్త ఒక పెద్ద మాసిన ముతక చీర ఒక తాడు తీసుకొని ఎండాకు ఏరడానికి పోతూ వుంది.

దానేలు కాల్చిన కొట్టు దింపడానికి నలుగురు కుర్రోళ్లు బేర్నీలో టైర్ల మీదకి ఎక్కి ఎండాకు కర్రని కిందున్న మనుషులకి అందిస్తున్నారు. ఆ కర్ర అందుకున్న మొదటి మనిషి బేర్నీలోంచి బయటకొచ్చి,

"నాయాల్ది కొట్టుకాల్చడంలో నిన్ను కొట్టేవోడు లేడు దానేలుమాం... పచ్చాకుని బంగారపు రంగులోకి మార్చావుగా," అన్నాడు దానేలుతో.

"ఆకుని బంగారపు రంగులోకి వచ్చేలాగ కాల్చడం నేర్చుకున్నాం గాని ఏం సుకంరా, మన బతుకులు బంగారపు రంగులోకి మార్చుకునే ఇద్దె్య నేర్చుకోలేక పోతిమే," అంటా పైకి లెగిసేడు అప్పుడే అక్కడకొచ్చిన రాజుగోరికి కుర్చీ ఎయ్యాను.

"అసె పోస్కోలు కబుర్లాపి పనిచెయ్యండ్రా," అంటా కుర్చీలో కూర్చున్నాడు రాజుగోరు.

కింద కూర్చున్నాడు దానేలు.

*ఆంధ్రజ్యోతి ఆదివారం*
*11 నవంబర్ 2018*

*



**ఇండ్ల చంద్రశేఖర్** 21 అక్టోబర్ 1984న కందులూరు, ప్రకాశం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ నేను నాన్న బిర్యాని సాక్షి ఆదివారం సంచికలో 2008లో వచ్చింది. దాదాపు 13 కథలు అచ్చయ్యాయి. రంగుల చీకటి కథాసంపుటి వెలువరించారు. ప్రస్తుతం హైదరాబాద్ లో పిహెచ్.డి. చేస్తున్నారు. ది ఆఘాఖాన్ అకాడమిలో డ్రామా టీచర్గా పనిచేస్తున్నారు.

*చిరునామా: ది ఆఘాఖాన్ అకాడమి, సర్వే నెం. 1/1, హార్డువేర్ పార్క్*
*మహేశ్వరం, రంగారెడ్డి, హైదరాబాద్ - 500 005.*
*ఫోన్: 9912416123 chandrasekhar.indla@agakhanacademies.org*